క్లుప్తంగా

ఆరిలోవ సీఐగా గోవిందరావు

- విధుల్లో చేరకుండానే పాత సీఐకు గాజువాక బదిలీ



ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ సీఐగా గంగుల గోవిందరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పని చేసిన సోమశేఖర్‌కు శ్రీకాకుళం బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో పెందుర్తి సీఐ ఎం.శ్రీనివాసరావును ఆరిలోవ సీఐగా బదిలీ చేశారు. ఇది జరిగి సుమారు రెండు వారాలైనా ఆయన ఇక్కడ విధుల్లో చేరలేదు. ఈ క్రమంలో ఆయన్ను ఇక్కడి నుంచి గాజువాక బదిలీ చేసి.. ఆ స్థానంలో గాజువాక నుంచి గోవిందరావును ఆరిలోవకు బదిలీపై పంపించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొత్త సీఐకి మర్యాద పూర్వకంగా ఇక్కడ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి అభినందన



క్రీడాకారిణి వర్షితను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఇటీవల ఖేలో ఇండియా పోటీల్లో సత్తా చాటిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల విద్యార్థిని కె.శ్రీవర్షితను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అభినందించారు. శ్రీచాణక్య డిగ్రీ కళాశాలలో బీబీఏ చదువుతున్న ఆమె బాక్సింగ్‌లో 45–48 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు వీసీ బుధవారం తన కార్యాలయంలో సత్కరించారు. జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

మొక్కల పెంపకంతో ఆహ్లాదకర వాతావరణం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఎదురుగా బుధవారం పలు మొక్కలను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నాటారు. ప్రతి విభాగం పరిసరాలల్లో పచ్చని మొక్కలను పెంచాలని ఆయన సూచించారు. విద్యార్థులకు మంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార జర్ర అప్పారావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ: తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టార్–1, సెక్టార్–2, కొత్త వెంకోజీపాలెం చుట్టు పక్కల ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎంవీపీ కాలనీ సెక్టార్–1 లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలంనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి పంచాయతన యాగ మహోత్సవం

ఎంవీపీ కాలనీ: శ్రీసరస్వతి సహిత పంచాయతన యాగ మహోత్సవాన్ని శుక్రవారం నుంచి ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నిర్వహించనున్నారు. శ్రీశారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్ఎస్‌వీ క్లాసెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలో నగరవాసులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



కచేరీ చేస్తున్న చిన్నారులు

బీచ్ రోడ్డు: త్యాగరాజ ఆరాధనోత్సవాలు కళాభారతి ఆడిటోరియంలో మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎనిమిదేళ్ల వయస్సు నుంచి 84 ఏళ్ల వయస్సు గల కళాకారులు భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రావ్యంగా పాడి అలపించారు. చిన్నారులు ఆశ్రీత్, అర్ణవ్ అన్నదమ్ములిద్దరూ కచేరీలో ప్రతిభ చూపించారు. 84 ఏళ్ల వారణాసి సరస్వతి ప్రదర్శన నేటి కళాకారులకు స్ఫూర్తిగా సాగింది.

కూడళ్లు.. ముస్తాబు

- రూ.1.29 కోట్లుతో సిద్ధమైన ఏఎస్ రాజా సర్కిల్
- తుదిమెరుగులు దిద్దుకుంటున్న ఉషోదయ సర్కిల్



తుది మెరుగులు దిద్దుకుంటున్న ఉషోదయ సర్కిల్



విద్యుత్ వెలుగుల్లో ఆధునీకీకరించిన ఏఎస్ రాజా సర్కిల్

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ కూడళ్లకు మహర్దశ కలిగింది. జీవీఎంసీ చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా కాలనీ కూడళ్లను ఆధునికీకరించారు. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఏఎస్ రాజా సర్కిల్‌ను అభివృద్ధి చేయగా.. జీవీఎంసీ జోన్–3 ఇంజినీరింగ్ విభాగం ఉషోదయ సర్కిల్‌ను తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే ఏఎస్ రాజా సర్కిల్ ఆధునికీకరణ పనులు పూర్తి కాగా.. ఉషోదయ సర్కిల్ తుది మెరుగులు దిద్దుకుంటోంది.

రూ.1.29 కోట్లుతో ఏఎస్ రాజా సర్కిల్

ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా సర్కిల్‌ను రూ.1.29 కోట్లతో అభివృద్ధి చేశారు. దీనికి సంబంధించిన పనులు ఇటీవలే పూర్తయ్యాయి. సర్కిల్ చుట్టూ కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్‌ను తీర్చిదిద్దారు. సర్కిల్ మధ్యలోని ఐల్యాండ్‌ను గ్రానైట్‌తో తీర్చిదిద్దారు. సర్కిల్ మధ్యలో ఫౌంటేన్ నిర్మాణం కూడా చేపట్టారు. సర్కిల్‌లో ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టి సర్కిల్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్ వర్కును స్టార్ ఆకారంలో తీర్చిదిద్ది సర్కిల్‌కు కొత్తశోభ తీసుకొచ్చారు.

రూ.36 లక్షలతో ఉషోదయ కూడలి

ఎంవీపీ కాలనీ 17వ వార్డు పరిధిలోని ఉషోదయ సర్కిల్‌ను సైతం జీవీఎంసీ జోన్–3 ఇంజినీరింగ్ విభాగం ఆధునికీకరిస్తోంది. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. సర్కిల్‌ను ఆనుకుని ఫుట్‌పాత్, రోడ్డు నిర్మాణాలు సైతం జీవీఎంసీ పూర్తి చేసింది. సర్కిల్‌లో ఐలాండ్‌తో పాటు వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి.

కైలాసగిరి కూడలిలో ట్రయల్ రన్



కైలాసగిరి కూడలిలో నిర్మించిన వాటర్ ఫౌంటేన్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు కైలాసగిరి కూడలి ఆకర్షణీయంగా తయారైంది. కైలాసగిరి కొండపైకి వెళ్లే దారిలో విశాలాక్షినగర్‌లో ఉన్న ఈ కూడలిని రూ.76 లక్షలతో జీవీఎంసీ అధికారులు ఆధునికీకరించారు. గోపురం మాదిరిగా నిర్మించి దానిపై నుంచి నీరు చిమ్ముతున్నట్లు వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. కూడలి చుట్టూ వివిధ రకాల మొక్కలతో ముస్తాబు చేశారు. మొక్కల చుట్టూ విశాలమైన ఫ్లాట్ ఫారం నిర్మించారు. దీనిని బుధవారం రాత్రి అధికారులు ట్రయల్ రన్ వేశారు. రంగు రంగుల నీరు పైకి చిమ్ముతూ ఆటుగా వెళ్లవారికి ఈ కూడలి కనువిందు చేసింది. అధికారులు కొద్ది రోజుల్లో ఈ కూడలిని ప్రారంభించనున్నారు.

ప్రతి విజయం వెనక సముద్రమంత కష్టం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి ప్రసంగం



మాలతీ చందూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రతి వ్యక్తి విజయం వెనక సముద్రమంత కష్టం దాగుంటుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం ఏయూ తెలుగు విభాగంలో డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి జాతీయ సదస్సు జరిగింది. ముందుగా మాలతీ చందూర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ మాలతీ చందూర్ సాహిత్య సమాలోచన పేరిట జరిగిన ఈ సదస్సులో వీసీ మాట్లాడుతూ వ్యక్తి విజయాన్ని మనం చూస్తాం కానీ అతి వెనక పడ్డ కష్టాన్ని పరిశీలించే ప్రయత్నం ఎందుకు చేయరని ప్రశ్నించారు. మాలతీ చందూర్ సాహితీ ప్రస్థానం వెనక ఎంతో శ్రమ దాగుందని, దానిని తెలుసుకుని, పరిశోధించే ప్రయత్నం జరగాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో దశాబ్దా కాలం పాటు పడ్డ కష్టాలు, ఆయన ఆశయ సాధన కోసం చేసిన కృషి తనకెంతో ఇష్టమన్నారు. ఏయూలోని వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తెలుగు విభాగంలో ధర్మనిధి ప్రసంగాలను ఏర్పాటు చేయడానికి కృషి చేసిన హిందీ విభాగం ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

విశిష్ట అతిథిగా ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ తరాలు మారినా తరగని ఆస్తిగా సాహిత్యాన్ని అందించారన్నారు. ఆ స్ఫూర్తితో తెలుగు విద్యార్థులు రచనా రంగం వైపు ప్రయాణించి మంచి రచనలతో సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు కీలకోపన్యాసం చేస్తూ ఆధునిక మహిళ చరిత్ర సృష్టిస్తుందన్న గురజాడ మాటకు నిలువెత్తు నిదర్శనంగా మాలతీ చందూర్ జీవితం నిలుస్తుందన్నారు. చిన్నప్పుడే చదువుకు దూరమై, వివాహం తర్వాత భర్త ప్రోత్సాహంతో లోకాన్ని చదివి సాహిత్యం వైపు ప్రయాణం చేసి, ప్రతి నవలలో స్త్రీనే కథానాయికగా చేసి సమస్యతో పాటు పరిష్కార మార్గాన్ని తెలియజేసిన మహోన్నత వ్యక్తి మాలతీ చందూర్ అని కొనియాడారు. విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, ప్రముఖ కథకులు ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్‌బాబు, డాక్టర్ బి.వెంకటస్వామి, అన్నంశెట్టి ఈశ్వరమ్మ, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయ్‌బాబు

బీచ్ రోడ్డు: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ వీఎస్ కృష్ణ కాలేజీలో మత్తు పదార్థులు–అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ ఐ.విజయ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలో టొబాకో, గంజాయి, ఎలక్ట్రానిక్ సిగరెట్, తదితర వాటికి చాలా దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి ఘన స్వాగతం

- థాయ్‌లాండ్‌లో వెండి పతకం సాధించిన ప్రకాష్



విశాఖ విమానాశ్రయంలో ప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న పాండ్రంకి రుక్మాకరరావు

గోపాలపట్నం: థాయ్‌లాండ్‌లో ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో వెండి పతకం సాధించిన మూలపర్తి ప్రకాష్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ నుంచి బుధవారం రాత్రి విశాఖ వచ్చిన ఆయన్ని ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ పాండ్రంకి రుక్మాకరరావు, సహచర క్రీడాకారులు పూలమాలలు, శాలువలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఈ 25 నుంచి 27వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో దేశానికి వెండి పతకం అందించడం ఆనందంగా ఉందన్నారు. తనకు శిక్షణ ఇచ్చిన కోచ్ రుక్మాకరరావు, ప్రోత్సహించిన కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దానియల్ మాస్టార్, యనమరెడ్డి కనకరెడ్డి, హేమలతారెడ్డి, అంజలిరెడ్డి, క్రీడాకారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సుబ్బరాజు మృతి తీరనిలోటు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు



సుబ్బరాజు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని, తదితరులు

అల్లిపురం: సీపీఐ సీనియర్ నాయకుడు, జాతీయ బ్యాంకుల యూనియన్ పూర్వ నేత, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పూర్వ పాలకవర్గ సభ్యుడు కె.వి.సుబ్బరాజు అకాల మృతి కార్మిక వర్గానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు అభిప్రాయపడ్డారు. కె.వి.సుబ్బరాజు సంతాప సభ బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.ఎస్.జె.అచ్యుతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ సుబ్బరాజు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారని, ముఖ్యంగా గ్రామిక వర్గం విముక్తికి, కమ్యూనిస్టు పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, క్షేత్రపాల్, బ్యాంక్ సహాయ ముఖ్య నిర్వహణ అధికారి వరలక్ష్మి, యూనియన్ నేతలు ఎర్రయ్యరెడ్డి, రెడ్డి శ్రీనివాస్, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేను, సీనియర్ నాయకులు దేవరకొండ మార్కండేయులు పాల్గొన్నారు. సుబ్బరాజు మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ వెళ్లి సుబ్బరాజు అంతిమయాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు. సుబ్బరాజు పార్థివదేహాన్ని పాడి మోసి దహన సంస్కారాలు నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న దేవదాయశాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ట్రిబ్యునల్ న్యాయమూర్తి హరినాథ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీన్ర సింహస్వామిని బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి హరినాథ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక,శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

జగనన్న సురక్షలో 288 మందికి వైద్య సేవలు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు ఆరిలోవ కాలనీలోని ఆఖరి బస్ స్టాప్ వద్ద ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. జనరల్, గైనిక్, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, తదితర విభాగాలకు చెందిన వైద్యులు ఇక్కడ రోగులకు ఉచితంగా పరీక్షలు జరిపారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా విభాగాలలో 288 మందికి వైద్య సేవలు అందించినట్లు యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ శ్రేష్ఠ తెలిపారు.

మూడో పట్టణ సీఐగా పార్థసారథి బాధ్యతల స్వీకరణ



రామారావు నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న పార్థసారథి

బీచ్ రోడ్డు: మూడో పట్టణ పోలీసు స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐగా పార్థసారథి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సీఐ రామారావు విజయనగరం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రామారావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. పార్థసారథి గతంలో ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేశారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఆయన సీఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

రౌడీషీటర్లపై నిఘా

- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

అల్లిపురం: నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో గల రౌడీషీటర్లపై నిఘా పెంచాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదేశించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ట్రాఫిక్, క్రైం, శాంతిభద్రతలు, స్పెషల్ బ్రాంచ్‌లకు వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ రవాణాకు అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రాత్రిపూట నిఘా మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన, జగనన్నకు చెబుదాం, డయల్ 112లకు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, లీగల్ అడ్వయిజర్లు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



గోడౌన్‌కు వేసిన సీల్ పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, రూరల్ తహసీల్దార్ రమణయ్యతో కలసి ఆయన గోడౌన్‌కు వేసిన సీల్, లోపల ఉన్న వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలించి.. సిబ్బంది విధులపై ఆరా తీశారు. భద్రత ప్రమాణాలు పాటించాలని వారిని ఆదేశించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, విశ్వనాథన్

సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమకూర్చిన నిధులు, దాతలు అందించిన ఆర్థిక సహాయంతో ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ ఆధునికీకరణ పనులు చేపడతామని స్థానిక అధికారులు తెలిపిన వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కార్యాలయం సిబ్బందితో పాటు ప్రజల కోసం అదనపు వసతులు, హంగులు సమకూర్చినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టి కృషితోనే అభివృద్ధి ఫలాలు సాధ్యమవుతాయని, ఇందుకు గతంలో ప్రారంభించుకున్న గాజువాక, ప్రస్తుతం సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయాలే ఉదాహరణ అన్నారు. ఈ ఆధునిక కార్యాలయం నుంచి ప్రజలకు ఉత్తమ సేవలందించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. రానున్నది ఎన్నికల కాలం కావడంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని, మంచి పనితీరు కనబరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, తహసీల్దార్లు ఆనంద్‌కుమార్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఏడేళ్లు జైలు

అక్కిరెడ్డిపాలెం: యువకునిపై దాడి చేసిన వ్యక్తికి గాజువాక కోర్టు 7 ఏళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరీమానా విధించింది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబర్ 28వ తేదీన గాజువాక గాయత్రి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద షేక్ అబ్దుల్లా అతని స్నేహితుడిని చంపేస్తానని బెదిరించడంతోపాటు బీర్ బాటిల్‌తో కుడి చేతి మీద, గెడ్డం మీద పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బి.బి.ఎస్.గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ వేయగా గాజువాక మేజిస్ట్రేట్ జి.షణ్ముఖరావు విచారణ అనంతరం పై విధంగా తీర్పు ఇచ్చారు.

ఆర్ఐవోగా సత్యనారాయణ సేవలు అమోఘం



సత్యనారాయణను సత్కరిస్తున్న గణేష్, సిబ్బంది

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన రాయల సత్యనారాయణ సేవలు అమోఘమని ఆర్ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్ అన్నారు. కార్యాలయ అధికారుల, సిబ్బంది అంతా బుధవారం సత్యనారాయణకు ఘనంగా వీడ్కోలు పలికారు. పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువతో సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, ఎంతో అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మురళి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్లో గేట్ నం.3 వద్ద బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. గవర్నమెంట్ రైల్వేపోలీసులు (జీఆర్పీ) సీఐ ధనుంజయనాడు ఆదేశాల మేరకు ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... సుమారు 60–65 ఏళ్ల వయస్సు గల మగ వ్యక్తి రైల్వే స్టేషన్ గేట్ నం.3 వద్ద మృతిచెందినట్టు కనుగొన్నారు. సుమారు 5.6అడుగుల ఎత్తు, కలిగి చామన ఛాయ శరీర రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ వ్యక్తి పింక్ రంగు గల చొక్కా, నీలం, బ్లూ జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఇతని వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ 98664 13487 / 94406 27547 నంబర్లలో తెలియజేయాలని శ్రీనివాసరావు తెలిపారు.

కంప్యూటర్-టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: కంచరపాలెం అశోకనగర్ బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఉచితంగా మహిళలకు టైలరింగ్, యువతకు కంప్యూటర్‌లో 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు, యువత దరఖాస్తులు చేసుకోవాలన్నారు మరిన్ని వివరాలకు 96760–30455 నంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

సీతమ్మధార : బాలికను నమ్మించి, కిడ్నాప్ చేసిన యువకుడిని ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరా లు ఇలా వున్నాయి. తాటిచెట్లపాలెం, ఎస్ఆర్ నగర్, చిట్టిబాబు కాలనీకి చెందిన యువకుడు టి.బంగారరాజు(23) తల్లిదండ్రులు చనిపోవడంతో అన్నయ్య వద్ద ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలికను నమ్మించి ఈ నెల 27న రాత్రి విజయవాడలోని బంధువుల ఇంటికి తీసుకెళ్లిపోయాడు. అక్కడి నుంచి రాజమండ్రి వచ్చి వుండగా... బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరినీ విశాఖ తీసుకొచ్చారు. బంగారురాజుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆచార్య భరతలక్ష్మికి జాతీయ పురస్కారం



ఆచార్య భరతలక్ష్మిని అభినందిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జువాలజీ విభాగం ఎమెరిటస్ ప్రొఫెసర్ ఆచార్య బి.భరతలక్ష్మికి జాతీయ పురస్కారం లభించింది. జువాలజీ రంగంలో చేసిన కృషి, పరిశోధనలకు గానూ బిస్వామోయ్ బిస్వాస్ గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని ఆమె అందుకున్నారు. జూలాజికల్ సొసైటీ ఈ అవార్డును ఇటీవల ఆమెకు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆచార్య భరతలక్ష్మిని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ఆచార్యులు సాధించే పురస్కారాలు వర్సిటీకి మంచి పేరు, ప్రతిష్టలను తీసుకువస్తాయన్నారు. విభాగ ఆచార్యులు ఆమెను అభినందించారు.